

బంగారు దుకాణంలో భారీ చోరీ

కడపలోని ఓ బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితుల నుంచి రూ.40.70 లక్షల విలువైన బంగారు నగలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



గండి శివాలయం పూజారి రామానంద కబీరు శివైక్యం

గండి శివాలయం పూజారి రామానంద కబీరు మంగళవారం కడపలోని జీవీఆర్ టవర్స్‌లోని తన శిష్యుల ఇంటిలో శివైక్యం చెందారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 461 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. రెండు అల్ట్రా డీలక్స్, రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. 28న ఉదయం 9గంటలకు ఇవి బయలుదేరుతాయన్నారు. తిరిగి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు అక్కడ బయలుదేరి మదనపల్లెకు చేరుకుంటాయన్నారు. నాలుగు టిక్కెట్ల కంటే ఎక్కువ ఉంటే ఇంటి వద్దకే టిక్కెట్లు తెచ్చి ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9959225676, 7382875034 నంబర్లలో సంప్రదించాలన్నారు.

‘ఆత్మవిశ్వాసం నింపుదాం.. ఆత్మహత్యలు ఆపుదాం’

బద్వేలు అర్బన్ : ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని, అటువంటి వారిలో ఆత్మవిశ్వాసం నింపి ఆత్మహత్యలు నివారించేందుకు ప్రతిఒక్కరం కృషి చేద్దామని జిల్లా మానసిక వైద్యాధికారి కవితప్రసన్న పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో జిల్లా మానసిక ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం సరిగా లేని వారికి ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా వైద్యం చేస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, సైక్రియాటిక్ నర్సింగ్ ఆఫీసర్ వెంకటనరసయ్య, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.

రిమ్స్ విద్యార్థిని ప్రతిభ

కడప అర్బన్ : కడప రిమ్స్ వైద్య విద్యార్థిని పల్లా శ్రీవింధ్య ప్రతిభచాటింది. ఈ నెల 8, 9,10 తేదీలలో నెల్లూరులో చెవి, ముక్కు, గొంతు వైద్యుల సంఘం రాష్ట్ర మహాసభలు (ఏఓఐ ఏపిసిఓఎన్) జరిగాయి. ఈ సభలో ఈఎన్‌టీ పీజీ విద్యార్థులకు చెవికి సంబంధించిన శస్త్ర చికిత్సాభ్యాసంలో జరిగిన పోటీలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఈఎన్‌టీ పీజీ వైద్యవిద్యార్థిని డాక్టర్ పల్లా శ్రీవింధ్య ప్రథమ స్థానంలో నిలిచారు. ఆమె డాక్టర్ ఎం. సుధాకర్ రావు గోల్డ్ మెడల్, ప్రతిభాపత్రాన్ని అందుకున్నారు. కాగా మంగళవారం ఈ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ అభినందించారు.

ఇంటింటి పరిశీలన క్షుణ్ణంగా తనిఖీ

– సీఈఓ ముఖేష్ కుమార్ మీనా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రత్యేక ఓటర్ల జాబితా–2024 సంక్షిప్త సవరణకు సంబంధించిన ఇంటింటి పరిశీలనను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రీ వెరిఫికేషన్ ఆఫ్ ఎలక్టార్స్, ఫారం–6, 7, 8 స్వీకరణ, పరిష్కారం, హౌస్ టు హౌస్ సర్వే, డూప్లికేట్, షిఫ్టెడ్, డెత్ ఎలక్టార్స్, 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇళ్లు, రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్, మొదటి, రెండవ, మూడవ దశలో ఎపిక్ కార్డ్స్ జనరేషన్, ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల వారీగా కలెక్టర్లతో సమీక్షించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ విజయ రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. డబుల్, షిఫ్టెడ్, డెత్ ఓట్ల తొలగింపునకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా తొలగించిన డబుల్ ఓట్లను మరొకసారి తనిఖీ చేయాలని, మూడు ఫార్మట్‌లలో ఎలా తొలగించారో పరిశీలించి, ఒకవేళ అసలైన ఓట్లు తొలగించి ఉంటే, ఎక్కడ తప్పు జరిగిందో తనిఖీ చేయాలని నియోజకవర్గ ఈఆర్వోలు, తహసీల్దార్లను ఆదేశించినట్లు తెలిపారు.

ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, హయ్యర్ బస్సుల సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని కడప జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కొంత మంది డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మరికొంత మంది ఇయర్ ఫోన్లను పెట్టుకుని విధులు నిర్వర్తిస్తున్నారని, ఇలాంటి ఘటనలు ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్టీసీకి ఆదాయం తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కడప రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ రాజా గజలక్ష్మి, మైదుకూరు డిపో మేనేజర్ శ్రీనివాసరావులు పలు సూచనలు చేశారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ శిక్షకుడు సుధా కృష్ణారెడ్డి రహదారిపై ఉండే సిగ్నల్స్, కేఎంపీఎల్ పెరుగుదలపై అవగాహన కల్పించారు.

శతశాతం.. ఫలసాయం



ఈ చిత్రంలోని రైతు పేరు కొరకూటి వెంకటసుబ్బయ్య. ఈయనది ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లె. గతంలో పెట్టుబడి లేక పొలాన్ని బీడుగా వదిలేశాడు. అయితే ప్రభుత్వ సాయంతో 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోట సాగు చేశాడు. తనకున్న రెండు ఎకరాల్లో 200 చీనీ మొక్కలు నాటాడు. ఇందుకు ప్రభుత్వం చేయూత ఇచ్చింది. గుంతలు తీయడంతోపాటు మొక్కలు, ఎరువులు, అంతర్ పంట, పొలం దున్నడం, కాపలా చార్జీలు ప్రతినెలా ఆ రైతుకు అందజేసింది. తోటలో చెట్లు ఏపుగా పెరుగుతుండడంతో ఆ రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

- సన్న, చిన్నకారు రైతులకు 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం
- 13 రకాల పండ్ల తోటలకు అవకాశం
- మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు
- జిల్లాలో వర్షాలు ఆలస్యం కావడంతో ఈనెల 20 వరకు దరఖాస్తుకు గడువు
- కొత్తగా గట్లపైన కొబ్బరి మొక్కలు నాటుకునే అవకాశం
- మునగకు ప్రభుత్వ ప్రోత్సాహం

కడప సిటీ : ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమగా పేరు గాంచింది. తర్వాత కాలంలో రాయలసీమ రాళ్ల సీమగా మారిపోయింది. కరువు వచ్చిందంటే సీమ ప్రజలు తిండికి నోచుకోక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక జలయజ్ఞం పేరిట ప్రాజెక్టుల



సాగులో ఉన్న నిమ్మ తోట

ఏర్పాటుతో బీడు భూములు పచ్చని పొలాలుగా మారే పరిస్థితి వచ్చింది. ఆ తర్వాత ఉపాధి హామీ పథకం కూడా ప్రవేశ పెట్టడంతో పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీలో అవకాశం కల్పించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ రైతాంగానికి ఊతమిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే ఉపాధి పథకంలో పండ్ల తోటల పెంపకానికి మరింత ప్రాధాన్యత ఇచ్చి రాయలసీమను కోనసీమలా మార్చేందుకు చర్యలు చేపట్టారు.

- ఈ ప్రభుత్వం వచ్చాక 4904 మంది రైతులకు సంబంధించి 10,242 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టడం జరిగింది. జిల్లాలో ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకం చాలా మెరుగ్గా కొనసాగుతోంది. 13 రకాల పండ్ల తోటల పెంపకానికి అవకాశం కల్పించారు. మూడేళ్లపాటు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు భరిస్తుంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో పండ్ల తోటల పెంపకానికి ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తులను అధికారులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని గడువు ఇచ్చారు.
- గతేడాది మునగ సాగుకు అవకాశం ఇవ్వగా, ఈ ఏడాది కొత్తగా పొలం గట్లపై కొబ్బరి మొక్కల సాగుకు అవకాశం కల్పించారు. సన్న, చిన్నకారు రైతులకు 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

13 రకాల పండ్ల తోటలు..

ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహాన్ని కల్పిస్తోంది. 13 రకాల పండ్ల తోటలను పెంచుకునేందుకు అవకాశం ఉంది. మామిడి, చీనీ, జామ, సపోట, కొబ్బరి, శీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, మునగ, తైవాన్ జామతోపాటు మల్లె, రోజా చెట్ల పెంపకాన్ని కూడా చేపట్టవచ్చు.

జిల్లాలో పండ్ల తోటల పెంపకం ఇలా..

- ఈ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ జిల్లాలో లక్ష్యానికి మించి పండ్ల తోటల సాగు జరిగింది. ఎన్ని దరఖాస్తులు వచ్చినప్పటికీ అర్హులైన రైతులందరికీ పండ్ల తోటల పెంపకానికి అవకాశం కల్పించారు.
- 2019–20లో ఉమ్మడి జిల్లాలో లక్ష్యం 5 వేల ఎకరాలు కాగా, 1845 మంది రైతులకు 4,632 ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది.
- 2021–22లో ఉమ్మడి జిల్లాలో లక్ష్యం 5 వేల ఎకరాలు కాగా, 2,235 మంది రైతులకు సంబంధించి 5,009 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం జరిగింది.
- 2022–23లో ఉమ్మడి జిల్లాలో లక్ష్యం 5 వేల ఎకరాలు కాగా, 2,591 మంది రైతులకు 5,940 ఎకరాల్లో ప్లాంటేషన్ జరిగింది.
- 2023–24లో జిల్లాలో 3 వేల ఎకరాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1,297 మంది రైతులకు సంబంధించి 3,218 ఎకరాల్లో పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1120 మంది రైతులు 2740 ఎకరాల్లో గుంతలు తీశారు. 779 మంది రైతులు 1905 ఎకరాల్లో మొక్కలు నాటారు.
- ఈ ఏడాది జిల్లాలో వర్షాలు ఆలస్యం కావడంతో ఆగస్టు 30వ తేదీకి గడువు ముగిసినప్పటికీ ఈనెల 20వ తేదీ వరకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

కొత్తగా కొబ్బరికి చోటు

ఈ ఏడాది కొత్తగా కొబ్బరి సాగుకు ప్రభుత్వం చోటు కల్పించింది. గతంలో ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల పెంపకం ద్వారా లబ్ధి పొందిన వారు కూడా వారి పొలం గట్లపైన శీతాఫలం, కొబ్బరి, నేరేడు మొక్కలను బండ్ ప్లాంటేషన్ విధానంలో నాటుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇందుకుగాను ప్రభుత్వం ద్వారా గుంతలు తీయడమే కాకుండా మొక్కలు ఉచితంగా ఇవ్వడంతోపాటు రెండు సంవత్సరాల నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది.

మునగకు కూడా..

మునగ నర్సరీల ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యతగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అవకాశం ఇచ్చారు. వారితోపాటు సాధారణ రైతు కూడా ఈ నర్సరీని తన సొంత పొలంలో మునగ మొక్కల నర్సరీ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి మండలంలోని ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఐదు మొక్కలు చొప్పున సరఫరా చేయడం జరుగుతుంది. వ్యక్తిగత ప్లాంటేషన్‌కు 0.25 ఎకరాకు 112 మొక్కలు చొప్పున సరఫరా చేస్తారు. ఆయా మండలాల్లోని ఎస్‌హెచ్‌జీ సభ్యుల ద్వారా నర్సరీలు ఏర్పాటు చేసుకోవచ్చు. కనిష్ఠంగా ఐదు వేల మొక్కలను నర్సరీలో పెంచుకునే అవకాశం ఉంటుంది. ఇందుకుగాను రూ. 30,100 ప్రభుత్వం ద్వారా సంబంధిత నర్సరీ పెంచిన ఎస్‌హెచ్‌జీలకు చెల్లించనున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం కోసం ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని అర్హులైన సన్న, చిన్నకారు రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలి. రైతు జీవన ప్రమాణాలు మెరుగు పరచాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి నిధుల ద్వారా మెట్ట భూమిలో ఉద్యాన పంటలు సాగుచేసే అవకాశాన్ని కల్పించేందుకు చర్యలు చేపట్టింది.
– యదుభూషణరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కడప

నాయకులుగా ఎదగాలి



లీడర్‌షిప్ స్కిల్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి రచించిన ‘లీడర్‌షిప్ స్కిల్స్’ పుస్తకాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మంగళవారం వైవీయూలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటితరం యువత, విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరమని, లీడర్‌షిప్ స్కిల్స్ పుస్తకం ఇందుకు మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం అనేది ఒక వ్యక్తి శారీరక, భావోద్వేగ, మేథోపరమైన కోణాలలో నిరంతరం జరుగుతుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నైతిక సూత్రాలు ఉన్నతమైన వ్యక్తిత్వం కోసం సహాయపడతాయన్నారు. పుస్తక రచయిత, వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ డిగ్రీ సిలబస్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని పుస్తకాన్ని రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ సంచాలకులు డా.ఎల్.సుబ్రహ్మణ్యశర్మ, ఆచార్య ఎన్.సి.గంగిరెడ్డి, ఆచార్య ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరీక్షలు తనిఖీ

యోగివేమన విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం కేంద్రగ్రంథాలయంలో డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు వైవీయూ అనుబంధ కళాశాలలకు సంబంధించి 900 మంది విద్యార్థులు హాజరుకాగా, 15 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి పరీక్షల నిర్వహణ తీరును వీసీకి వివరించారు.

మట్టిగణపతే.. మహా గణపతి

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు.... మట్టి ప్రతిమలే ముద్దు

రాజంపేట టౌన్ : పండుగల్లోకెల్లా వినాయక చవితి పండుగ ప్రత్యేకమైనది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ప్రజలు కలిసి మెలసి ఈ పండుగ ఉత్సవాలను ఆనందంగా జరుపుకుంటారు. ఈనెల 18వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. వినాయక చవితిని జరుపుకోవాలంటే ప్రధానంగా కావాల్సింది గణపయ్య విగ్రహం. అయితే చాలా మంది మార్కెట్‌లో సులువుగా దొరికే ప్లాస్టర్ ఆఫ్ పారీస్ (పీఓపీ)తో తయారు చేసిన రంగురంగుల బొజ్జగణపయ్యలను తెచ్చుకొని పూజిస్తారు. అయితే రసాయనాలతో తయారు చేసిన ఈ విగ్రహాలకంటే మట్టి విగ్రహాలను పూజిస్తే పర్యావరణానికి ఎంతో శ్రేయస్కరమని విద్యావంతులు చెబుతున్నారు. అలాగే సహజసిద్ధంగా ప్రకృతిలో దొరికే ముడిసరుకుతో చేసే వినాయక ప్రతిమలనే పూజించాలని పురాణాలు కూడా చెబుతున్నాయి.

మట్టితో మనిషికి విడదీయరాని బంధం..

మట్టికి, మనిషికి విడదీయరాని బంధం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే మానవ మనుగడ ప్రకృతితో ముడిపడివుంది. ప్రకృతి ఆరాధనతో మొదలైన పూజలు ఇప్పుడు విగ్రహ ఆరాధన వరకు వచ్చాయి. అయితే వినాయక ఉత్సవాల అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేయాల్సివున్నందున కళాకారులు సులువుగా విగ్రహాలను తయారు చేసేందుకు ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇటీవల



వినాయక చవితి కోసం పాలెంపల్లెలో సిద్ధమైన మట్టి విగ్రహాలు

కాలంలో విగ్రహాల ఏర్పాటు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. జిల్లాలో వేల సంఖ్యల్లో పెద్ద విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు సంభవించే ప్రమాదముందని విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

మట్టివిగ్రహాల తయారీకి కేరాఫ్ అడ్రస్ పాలెంపల్లి

మట్టి వినాయక విగ్రహాల తయారీకి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కడప సమీపంలో ఉన్న పాలెంపల్లె కేరాఫ్ అడ్రస్ అని చెప్పవచ్చు. ఆ గ్రామంలో దాదాపు వంద కుటుంబాలు ఉన్నాయి. ఒకప్పుడు అరవై నుంచి డెబ్బై కుటుంబాల వారు మట్టి విగ్రహాలను తయారు చేసేవారు. ప్రస్తుతం ముప్పై కుటుంబాల వారు మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా అక్కడి కళాకారులు దాదాపు యాభైవేల విగ్రహాలకు పైగా తయారు చేస్తారు. పాలెంపల్లెలో తయారయ్యే మట్టి విగ్రహాలను ప్రధానంగా స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు కొనుగోలు చేసి ఉచితంగా పంపిణీ చేస్తారు. అలాగే వ్యాపారులు కూడా వీరి వద్ద నుంచి విగ్రహాలను కొనుగోలు చేస్తారు.

మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలు ఇవీ..

- సహజసిద్ధంగా లభించే బంకమట్టితో చేసే విగ్రహాలు త్వరగా నీటిలో కరిగిపోతాయి.
- మట్టి విగ్రహాలను నిమజ్జనం చేసినా నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.
- కాలుష్యానికి ఎలాంటి హాని చేయదు. అందువల్ల స్వచ్ఛమైన గాలి, వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు.

రసాయన విగ్రహాల వల్ల కలిగే అనర్థాలు..

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు త్వరగా నీటిలో కరగవు.
- ఈ విగ్రహాల్లో జిప్సం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, కార్బన్ వంటి అవశేషాలు ఉంటాయి.
- ఇలాంటి విగ్రహాలు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగితే జీర్ణకోశ వ్యాధులు సంక్రమిస్తాయి.
- నీటిలో ఉండే చేపలు వంటి జీవరాసులు కూడా రోగాల బారిన పడతాయి.
- రసాయనాలు కలిసిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి కేన్సర్ వ్యాధికి దారితీస్తుంది. అలాగే చర్మవ్యాధులు సోకుతాయి.
- రసాయనిక రంగులు కలిసిన నీరు పంట పొలాలకు చేరితే దిగుబడులు తగ్గిపోతాయి. అలాగే ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావాన్ని చూపుతుంది.

శాస్త్రీయంగా కూడా శ్రేష్ఠమైనది..



మట్టి విగ్రహాలను పూజించడం శాస్త్రీయంగా కూడా శ్రేష్ఠమైనది. అంతేకాక మట్టి విగ్రహాలను తయారు చేసే వారు చాలా నియమ, నిష్ఠలతో విగ్రహాలను తయారు చేస్తారు. నిష్ఠతో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తే చాలా మంచిది. మేము చిన్నప్పటి నుంచి మట్టి విగ్రహాన్నే పూజిస్తున్నాము.
– నరసింహమూర్తి, పురోహితులు, రాజంపేట

చైతన్యం కల్పిస్తున్నాం..



మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారీస్ వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు తెలియ చేసి వారిలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. మా వంతు బాధ్యతగా మా కళాశాలలోని విద్యార్థులకు మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి చైతన్యం కలిస్తూ, వారి ప్రాంతాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలియచేస్తున్నాం. భావితరాల మనుగడ కోసం మట్టి విగ్రహాలను పూజించాల్సిన ఆవశ్యకత ఉంది.
– జి.మోహనవల్లి, అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మదనపల్లె

పోలింగ్‌స్టేషన్ల వారీగా రీవెరిఫికేషన్

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రత్యేక ఓటర్ జాబితా 2024 సంక్షిప్త సవరణకు సంబంధించి డబుల్, బదిలీ, చనిపోయిన ఓట్లను, ప్రతి ఇంటా పరిశీలనను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి ‘ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2024’కు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి జిల్లా కలెక్టర్‌లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో, జిల్లా స్థాయిలో పొలిటికల్ పార్టీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. డూప్లికేట్, షిఫ్టెడ్ మరియు డెత్ ఓటర్లకు సంబంధించి ఫార్మ్ 7 మరియు 8 తప్పనిసరిగా తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే పోలింగ్ స్టేషన్ల వారీగా తొలగించిన డబుల్ ఓట్లను మరొకసారి తనిఖీ చేయాలని, మూడు ఫార్మట్‌లలో ఎలా తొలగించారో ఒకవేళ అసలైన ఓట్లు తొలగించి ఉంటే, ఎక్కడ తప్పు జరిగిందో తనిఖీ చేయాలని నియోజకవర్గ ఈఆర్‌ఓలు, తహసీల్దార్లను మరోమారు ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, మురళి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీకేటీ భూముల అవార్డ్సును త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో చేపట్టిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి డీకేటీ భూములు అవార్డ్సు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

ఆర్డీఓలు, తహశీల్దార్‌లను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫిరెన్సు హాల్‌లో రిజర్వాయర్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, ఆర్అండ్ఆర్ కార్యక్రమాలు, గాలివీడు మండలంలోని సోలార్ పార్కు భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మొత్తంగా 1074.63 ఎకరాలు అవసరం కాగా వందశాతం భూసేకరణ చేశామన్నారు. ప్రభుత్వభూమి 177.66 ఎకరాలు, 446.50 ఎకరాల పట్టా భూములు, 451.65 డీకేటీ భూములు ఉన్నాయన్నారు. పట్టా భూములకు, డీకేటీ భూములకు సంబంధించి 274.74 ఎకరాలకు అవార్డ్సు ప్రక్రియ పూర్తి చేశారన్నారు. డీకేటీలో మిగిలిన 176.91 ఎకరాలకు అవార్డ్సు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గాలివీడు మండలం తూముకుంట, వెలిగల్లులలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పార్కుకు సంబంధించి ఇప్పటికే 1115 ఎకరాలు భూ సేకరణ చేశారని కలెక్టర్ అన్నారు. మిగిలిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, హెచ్ఎంఎస్ఎస్ యూనిట్–2 ఎస్‌డీసీ గోపాలకృష్ణ,ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తించాలి

రాయచోటి : జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వ భూములు గుర్తించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫిరెన్సు హాల్ నుంచి భూ సేకరణపై ఆర్డీఓలు, తహశీల్దార్లతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వీడియో కాన్ఫిరెన్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లాలో వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అసైన్మెంట్ భూములు, ఇనామ్ భూములను గుర్తించి వెంటనే తమకు రిపోర్టు పంపాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని సంబంధిత తహశీల్దార్లు సర్వే నెంబర్ల వారిగా భూములు గుర్తించాల న్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యాలను అధిగమించాలి

డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

నందలూరు (రాజంపేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టనున్న జగనన్న ఆరోగ్యసురక్ష లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బీ.సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలతో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై ఏఎన్ఎం,



జగనన్న ఆరోగ్యసురక్ష అమలుపై సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

వలంటీర్లకు డిపార్టుమెంట్ ట్రెనింగ్ ఇస్తారన్నారు. సెప్టెంబరు 15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. 15 రోజులపాటు సర్వేకి సీహెచ్‌వో, ఏఎన్ఎంలు డోర్ టు డోర్ సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. వైద్యాధికారిణి స్పజన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలకు యాప్ ఇస్తామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బయోమెట్రిక్ తీసుకొని సర్వే పూర్తి చేయాలన్నారు. వలంటీర్లు కూడా రెండవసారి ఫీల్డ్‌మీదకు వెళ్లి సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను వివరిస్తూ ఆరోగ్యశ్రీ కరపత్రాన్ని అందచేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సౌభాగ్య, వైద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రణాళిక

సంబేపల్లె : జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమానికి సంబంధించి రాష్ట్రస్థాయి అదనపు సంయుక్త సంచాలకుడు (లెప్రసి) డాక్టర్ సాగర్ సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం ద్వారా గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా రోగులకు మెరుగైన చికిత్స అందజేస్తారన్నారు. అనంతరం ఆరోగ్య వైద్య సిబ్బందితో సమావేశమై జగనన్న ఆరోగ్య సురక్షపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: అప్పుల బాధతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బి.కొత్తకోట పట్టణంలోని బోయవీధికి చెందిన రాము కుమారుడు బి.మధు(35) బీటెక్ పూర్తిచేశాడు. కొంతకాలంగా దురలవాట్లకు లోనై ఎక్కువగా అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పుల ఒత్తిడి ఎక్కువ కావడంతో భరించలేక ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

పెద్దమండ్యం : మండలంలోని దిగువ కల్వటాల గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న సరపల్లి గురవయ్యను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. అతని వద్ద నుంచి 40 బాటిళ్లను స్వాధీనం చేసుకునామన్నారు.

ఎర్రచందనం నిందితులకు కౌన్సెలింగ్



కడప అర్బన్ : ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలో గతంలో వివిధ ఎర్రచందనం కేసుల్లో ప్రమేయం ఉన్న వారికి కడప డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ ఎం.డి షరీఫ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సత్ ప్రవర్తనతో జీవించాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు దుకాణంలో భారీ చోరీ

- వారం రోజుల్లోనే ఛేదించిన పోలీసులు
- రూ. 40.70 లక్షల విలువైన 808 గ్రాముల బంగారు ఆభరణాలు, బైకు స్వాధీనం
- మరో ఇద్దరు దొంగల కోసం గాలింపు
- జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వెల్లడి



చోరీ కేసులో నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : కడప నగరంలోని అమ్మవారిశాల వెనుకవైపు వీధిలో షేక్ కాజం మహమ్మద్ అలీకి చెందిన బంగారు దుకాణంలో చోరీకి పాల్పడిన నలుగురు నిందితులలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.40.70 లక్షల విలువైన 808 గ్రాముల బంగారు ఆభరణాలు, బైకును స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన వారం రోజుల్లోపే పోలీసులు ఈ కేసు మిస్టరీని ఛేదించారు. మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

కడప నగరంలోని అమ్మవారిశాల వీధి వెనుకవైపు షేక్ కాజం మహమ్మద్ అలీ బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. తమకు బంగారు ఆభరణాలు చేయించమని వినియోగదారులు బంగారు ఇవ్వగా ఆభరణాలు చేయించి తన దుకాణంలోని ఇనుపబీరువాలో పెట్టాడు. ఈనెల 3వ తేదీ రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణంలోకి ప్రవేశించి బంగారు నగలతో ఉన్న చిన్న బీరువాను ఎత్తుకుని వెళ్లారు. ఈ బీరువాలో దాదాపు 847.450 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు, పాత బంగారు బిస్కెట్‌లు ఉన్నాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో సీఐ సయ్యద్ హాసం తమ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా తమకు లభించిన సీసీ పుటేజీలు, ఇతర ఆధారాల ద్వారా ఈ నేరానికి పాల్పడిన నిందితులను గుర్తించారు. చోరీకి పాల్పడిన వారిలో కడప నగరంలోని ఎస్‌బీఐ కాలనీ వెనుకవైపు ఉన్న అలీనగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ ఫైరోజ్, రవీంద్ర నగర్, మరాఠీవీధికి చెందిన షేక్ ఖలీద్ అహమ్మద్, పఠాన్ ఫహాద్ ఖాన్, సయ్యద్ నూర్ అహమ్మద్‌లు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నలుగురు నిందితులు స్నేహితులుగా ఉండి, జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడాలని భావించారు. వీరు దొంగతనానికి పాల్పడే ముందు నిందితులలో ఒకరైన షేక్ ఖలీద్ అహమ్మద్ తండ్రి నిసార్ అహమ్మద్ గుమస్తాగా పనిచేస్తున్న బంగారు నగల దుకాణం తాళం చెవిని దొంగిలించారు. ఆ తాళం చెవిని ఉపయోగించి ఈనెల 3వ తేదీ రాత్రి నలుగురు నిందితులలో ఇద్దరు దుకాణం బయట కాపలాగా ఉండి, మరో ఇద్దరు లోపలికి వెళ్లి చిన్న ఇనుప బీరువాను బయటకు తీసుకుని వచ్చారు. వీరు ఆ బీరువాను బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ సమీపంలోని కంపచెట్లలోకి తీసుకుని వెళ్లి అక్కడ దాన్ని తెరిచారు. అందులోని బంగారు ఆభరణాలను వెంటనే పంచుకోకుండా, తాత్కాలికంగా జల్సా ఖర్చుల కోసం తలా ఒక బంగారు గాజులను పంచుకున్నారు. పరిస్థితి సద్దుమణిగాక బంగారు ఆభరణాలను పంచుకోవాలని అనుకుని చిన్న బీరువాను అదే కంపచెట్లలో దాచిపెట్టారు. పోలీసుల నిఘా పెరగడంతో ఇద్దరు నిందితులు పరారయ్యారు. తాము దాచి ఉంచిన చిన్న బీరువా వద్దకు షేక్ మహమ్మద్ ఫైరోజ్, షేక్ ఖలీద్ అహమ్మద్‌లు వెళ్లారు. చిన్న బీరువాను తెరిచి అందులో నుంచి చెరో రెండు బంగారు గాజులను తీసుకున్నారు. అక్కడ చిన్న బీరువాను ఉంచడం మంచిది కాదని భావించి బైకుపై దాన్ని పెట్టుకుని కంపచెట్ల నుంచి బయటకు తీసుకుని వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్ట్ చేసి, చిన్న బీరువాలోని 808 గ్రాముల బరువున్న 5 పాత బంగారు కడ్డీలు (బంగారు బిస్కెట్‌లు), 34 బంగారు ఉంగరాలు, ఒక చైను, 4 బంగారు గాజులు, బైకును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.40.70 లక్షలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు పఠాన్ ఫహాద్ ఖాన్, సయ్యద్ నూర్ అహమ్మద్‌ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇంకా ఈ కేసులో ఎవరెవరి పాత్ర ఉందో సమగ్రంగా విచారిస్తామని ఎస్పీ తెలిపారు.



చోరీ కేసులో రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ

దొంగతనం కేసులో బంగారు ఆభరణాలను రికవరీ చేయడంలో, నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.

ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి– ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

జిల్లాలో ప్రతి ఒక్కరూ వ్యాపారసంస్థలు, దుకాణాలలో, ప్రైవేట్ కార్యాలయాల వద్ద, రోడ్లలో సీసీ కెమెరాలను సామాజిక బాధ్యతగా భావించి ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. నేరాల నియంత్రణలో, నేరాలకు పాల్పడిన వారిని పట్టుకోవడంలో సీసీ కెమెరాల వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

శ్రీ భారతీయ విద్యా భవన్
ఇంగ్లీష్ మీడియం స్కూల్, విద్యాభవన్ రోడ్,
ప్రశాంత్ నగర్, కొత్తపేట, రామాపురం,
రాయచోటి - 516269, అన్నమయ్య జిల్లా.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 90101 24073

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లె : ద్విచక్రవాహనదారుడు ట్రాక్టర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. బండ్లపై గ్రామానికి చెందిన జి.అంజప్ప(40) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, పిట్టావాండ్లపల్లె క్రాస్‌వద్ద ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడగా, స్థానికులు గమనించి 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దారి దోపిడీ కేసులో ఖాకీల హస్తం

- రూ.2 కోట్ల దారిదోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్
- నిందితుల్లో ఇద్దరు ఏఆర్ పోలీసులు
- రూ.1.81 కోట్ల నగదు రికవరీ
- 2 కార్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్ : జాతీయ రహదారి–44పై సంచలనం రేపిన రూ.2కోట్ల దారి దోపిడీ కేసును 'అనంత' పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు ఏఆర్ పోలీసులు ఉండటం గమనార్హం. వీరి నుంచి రూ.1.81 కోట్ల నగదు రికవరీ చేశారు. రెండు కార్లు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కె.శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. ఆగస్టు 22న ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన రూ.2 కోట్ల నగదుతో కంపెనీ ప్రతినిధులు ఇన్నోవా వాహనంలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి సమీపంలోని 44వ జాతీయరహదారిపైకి రాగానే కొందరు పోలీసు దుస్తుల్లో వచ్చి అటకాయించారు. రూ.2కోట్ల నగదు బ్యాగును తీసుకుని ఉడాయించారు. దోపిడీ ఘటనపై ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పరిపాలనాధికారి శ్రీపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేశారు. దోపిడీకి సంబంధించి తొలుత ఎలాంటి ఆధారాలూ లభించలేదు. కేసును ఎస్పీ కె.శ్రీనివాసరావు చాలెంజింగ్‌గా తీసుకుని రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలను దింపారు. 'సెబ్' అదనపు ఎస్పీ రామకృష్ణతో పాటు అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి ఆధ్వర్యంలో దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

నిందితులను ఇలా గుర్తించి

దారి దోపిడీ కేసుకు సంబంధించి ఆరుగురు నిందితులను పోలీసులు గుర్తించారు. నిందితుల్లో వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం మల్లాయపల్లికి చెందిన కారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కడపకు చెందిన వేంపల్లి సూర్యనారాయణరాజు, ఏఆర్ కానిస్టేబుల్ చమర్తి సుబ్బరామరాజు అలియాస్ సుబ్బరాజు, నెల్లూరు జిల్లాకు చెందిన హైదరాబాద్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుంచె వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్, రంగారెడ్డి జిల్లాకు చెందిన బండ్లగూడజాగీర్ వాసి గుర్రాల విజయ్‌కుమార్, హైదరాబాదులోని మాదాపూర్ పర్వతనగర్‌కు చెందిన చెంజీ రేవంత్‌కుమార్ ఉన్నారు.

దోపిడీకి వ్యూహకర్త ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్..

దారిదోపిడీకి హైదరాబాద్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుంచె వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ వ్యూహకర్త. ఇతనికి ఎస్ఆర్ఆర్ కంపెనీలో డ్రైవరుగా పనిచేసే రంగారెడ్డి జిల్లాకు చెందిన గుర్రాల విజయ్‌కుమార్, అన్నమయ్య జిల్లాకు చెందిన చెంజీ రేవంత్‌కుమార్‌తో పరిచయముంది. ఈ పరిచయమే రూ.2 కోట్ల దోపిడీకి దారి తీసింది. పెద్ద మొత్తంలో వచ్చే నగదు, వాహనాలు, ఇతర సమాచారాన్ని విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకుని దోపిడీకి తెగబడ్డారు. ఈ క్రమంలో వేణుగోపాల్‌రెడ్డిని వెంకటేష్ కలిసి దారి దోపిడీకి ప్రణాళిక రచించారు. మరికొందరిని కలుపుకొని ప్రణాళికను అమలు చేయాలని భావించారు. అందులో భాగంగా ఏఆర్ కానిస్టేబుల్ సుబ్బరామరాజుతో పాటు మహేశ్వరరాజును కలుపుకుని ఆగస్టు 22న కడప నుంచి అనంతపురం బయల్దేరి వచ్చారు. ఎస్ఆర్ఆర్ కంపెనీ డ్రైవర్ రేవంత్ ఇచ్చిన సమాచారంతో గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద కాపు కాశారు. పోలీసు దుస్తుల్లో రంగంలోకి దిగి.. డబ్బుతో వస్తున్న ఇన్నోవా కారును ఆపి కంపెనీ పరిపాలనాధికారి శ్రీపతిరావు, అనుపమరావు, డ్రైవరు శివను భయపెట్టి.. వాహనంలో తరలిస్తున్న రూ.2కోట్ల నగదున్న బ్యాగును తీసుకుని పరారయ్యారు. దోపిడీ సొమ్మును మొత్తం ఏడుగురు పంచుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుల కోసం దర్యాప్తు వేగవంతం చేశారు. అందిన సమాచారం మేరకు.. కడప శివారులో తిరుపతి హైవే పక్కన నిరుపయోగంగా ఉన్న దాబా వద్ద ఉన్న ఆరుగురు నిందితులు కారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సూర్యనారాయణరాజు, సుబ్బరామరాజు, కుంచె వెంకటేశ్వర్లు, గుర్రాల విజయకుమార్, చెంజీ రేవంత్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.1.81 కోట్లు నగదుతో పాటు రెండు కార్లు, 8 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

గండి శివాలయం పూజారి రామానంద కబీరు శివైక్యం

- బాల్యం నుంచి శివపార్వతుల సేవలోనే తరించిన వైనం
- నేటి సాయంత్రం శివాలయం వద్దనే అంత్యక్రియలు



రామానంద కబీరు (ఫైల్)

చక్రాయపేట : గండి క్షేత్రంలోని పాపాఘ్ని నదికి ఆవలి వైపున ఉన్న శివాలయం పూజారి రామానంద కబీరు(85) మంగళవారం మధ్యాహ్నం కడప నగరంలోని జీవీఆర్ టవర్స్‌లోని తన శిష్యుల ఇంటిలో శివైక్యం చెందారు. ఆయన భౌతికకాయం మంగళవారం సాయంత్రం గండిలోని శివాలయం వద్దకు తెచ్చి భక్తుల దర్శనార్థం ఉంచారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు శివాలయం వద్దనే అంతిమ సంస్కారం నిర్వహిస్తామని ఆయన శిష్య బృందం వెల్లడించారు.

రామానంద కబీరు నేపథ్యం..

గండి సమీపంలోని వీరన్నగట్టుపల్లెలో ముస్లింల ఇంట ఆయన జన్మించారు. పేదరికం కారణంగా ఆయన గండి భూమానంద ఆశ్రమ పీఠాధిపతి రామానంద స్వామి వద్ద శిష్యుడిగా చేరి ఆవులను మేపుతుండే వారు. ఈ క్రమంలో పాపాఘ్ని నదిలో ఆవులు మేపుతున్న సమయంలో మా సేవ చేసుకో అనే మాటలు వినిపిస్తుండేవట. అంతేకాకుండా రాత్రి పూట కలలో కూడా కనిపిస్తుండటంతో ఈ విషయం ఆయన తన గురువు రామానందస్వామికి చెప్పారు. దీంతో ఆయన ఆ మాట అంటున్నది ఎవరోకాదు ఆదిదంపతులైన శివపార్వతులని.. వారి సేవ చేసుకునే భాగ్యం నీకు కల్పించారు అని చెప్పడంతో ఆయన తన బాల్యం నుంచే వారి సేవకు అంకితమయ్యారు. రెండేళ్ల క్రితం ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కడపకు చెందిన వైద్యుడు వంశీకృష్ణ, శశిబిందుల ఇంటిలో ఉండిపోయారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం పరమపదించారు.

మత్తుకు బానిసలు కావద్దు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

రాయచోటిటౌన్ : మత్తుకు బానిసలు కావద్దు మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు.. అని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నేటి యువత ఎక్కువగా మత్తుకు బానిసగా మారుతోందన్నారు. దీనివల్ల చివరికి ఏకాగ్రత దెబ్బతిని వారి జీవితాలను నాశనం చేసుకొంటున్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ భావి భారత పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి మత్తుకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, కళాశాల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ధీరజ్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ, ఎస్ఎస్ఎస్ అధికారి కరుణాకర్ తదితులు పాల్గొన్నారు.

మృతుడు రైల్వే కోడూరు వాసి

చిల్లకూరు(తిరుపతి జిల్లా): మండలంలోని బూదనం టోల్ ప్లాజా దాటిన తరువాత బైక్‌పై వెళుతున్న వారిని సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన వ్యక్తి రైల్వే కోడూరు వాసిగా పోలీసులు గుర్తించారు. మంగళవారం వారు తెలిపిన వివరాల మేరకు రైల్వే కోడూరుకు చెందిన కోవూరు మోజస్ (55) అనే వ్యక్తి గూడూరు మండలం చెన్నూరులోని తన కుమార్తెను చూసుకుని నాయుడుపేటలో ఉన్న మరో కుమార్తెను చూసేందుకు పోటు పాళెంకు చెందిన నవకోటి బైక్‌పై ఎక్కి నాయుడుపేటకు బయలుదేరారు. ఈ క్రమంలో టోల్ ప్లాజా వద్ద బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మోజస్ మృతి చెందగా, నవకోటికి తీవ్రగాయాలయ్యాయి. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు టోల్ ప్లాజా సీసీ కెమెరాల ద్వారా దొడ్ల డైరీకి చెందిన పాల ట్యాంకర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.